హాస్యకథ

# పాడుకథ పాడుగానూ!

-కవితా దివాకర్

**ఓసారి ఒంట్లో బాలేక ఆఫీస్‌కి సెలవు పెట్టి ఇంట్లో ఉండాల్సి వచ్చింది! ఒకటా రెండా... ఏకంగా పది రోజులు! పట్టుమని పది నిముషాలైనా కుదురుగా ఓ చోట కూర్చోలేని నేను... పదిరోజులు ఇంట్లో ఉండాల్సి వచ్చేసరికి.. ఏమీ తోచక కాలుగాలిన పిల్లిలా తిరగడం మొదలెట్టాను!**

ఉన్నట్టుండి అకస్మాత్తుగా నాకో బ్రహ్మాండమైన ఐడియా తట్టింది! ఉత్తివే ఇంట్లో బెడ్ మీద పడుకుని టైం వేస్ట్‌చేసే బదులు... ఎంచక్కా ఓ కథరాస్తే ఎలా ఉంటుందీ అనీ!

లేడికి లేచిందే పరుగులా... వెళ్ళి కాగితాల బొత్తి తెచ్చి ముందేసుక్కూర్చున్నాను.

ఒక నాల్గయిదు వాక్యాలురాసి... రాసింది నేనేనా అని తెగ మురిసిపోయి, ఎన్నిసార్లు చదువుకున్నానో లెక్కేలేదు.

కథ రాసేప్పుడు ఏ అడ్డంకులేకుండా చకచక ఏకబిగిన పదిపేజీల కథ రాసేశాను! కానీ కథ రాశాకే నా అసలు పాట్లు మొదలయ్యాయి


నేను కథ రాయక ముందు... రాయాలనే తపన... రాశాక దాన్ని ఎదుటి వాళ్ళకి విన్పించాలనీ... వాళ్ళచేత చదివించాలనే ఆరాటం...!

పెద్దక్కయ్య శోభకి చూపించాలంటే.. "నీ ముఖం... నువ్వు కథలు రాయడమేమిటి?" అని కసురు కుంటుందేమోనని భయం!

ఇహ ఇదేం బాలేదనీ... టెన్త్ చదువుతోన్న పెద్దక్కయ్య కొడుకు అనిల్‌నీ, నైన్త్ చదువుతోన్న రెండో అక్కయ్య కొడుకు బ్రిజేష్‌నీ, ఫోర్త్ చదువుతోన్న మూడో అక్కయ్య కొడుకు విజయ్‌నీ నా ఎదురుగా కూర్చోబెట్టి... ఊహుఁ ఒకరకంగా 'కట్టి' పడేసి... 'నేను రాసిన కథ వినండర్రా' అని కథ చదవడం ప్రారంభించాను.

'సర్లే' అని కథ వింటున్నట్టు పోజులు పెడ్తూ... ముందు కూర్చున్న వాళ్ళంతా...

ఒకొ_కు_రే ఏదో పనునట్టు వెనకచేరి... నన్ను



వెక్కిరించడం అఫ్‌కోర్స్ నేను గమనించకపోలేదు

అయినా ఎలాగోలా వాళ్ళు నాకథ వినడం ముఖ్యం కదా అని ఆ విషయం గమనించనట్టే నటించాను!

పైగా నా జోరు ఏమాత్రం తగ్గకుండా రెట్టించిన హుషారుతో చదవడం పూర్తిచేసి వెనక్కుతిరిగి చూస్తును కదా... ఒక్కడు కన్పిస్తే ఒట్టు!

కథంటే ఏమిటో తెలీని కుర్రకుంకలక్కూడా నా చేతిలో పేపర్లూ, పెన్నూ చూసి అక్కడి కదేంటో పామును చూసినట్టు హడలిపోయి, నన్ను చూసీచూడగానే పారిపోవడం చూసి... ఆ అవమానానికి తట్టుకోలేక ఒక్క క్షణం ఆత్మహత్య చేసుకుందామని అన్పించినా... నా కథ అచ్చవకుండానే చావటం ఇష్టంలేక ఆ ప్రయత్నం మానుకున్నాను!

'పోరా బోడి వెధవల్లారా...మీదేంటి లెక్క! నన్ను నవమాసాలు మోసి,కనిపెంచిన మా అమ్మకి విన్పిస్తా నీ కథ' అని నిశ్చయించుకుని రాత్రి అమ్మ పక్కలో దూరి 'ధరణికి గిరి భారమా... గిరికి తరువు భారమా... తరువుకి కాయభారమా కనిపెంచే తల్లికి పిల్ల భారమా' అని కూనిరాగం తీస్తూ 'కథ చదువుతా వినమ్మా' అంటూ కాగితాలు తెరిచాను.

రెండు పేజీలు చదివానో లేదో... నిద్ర ఆపుకోవడానికి శత విధాలా ప్రయత్నిస్తూ 'రేపు ఉదయం తొందరగా నిద్రలేవాలే! పొద్దుణ్ణించీ అలిసిపోయాను' అని ఆవలిస్తూ... కన్నకూతుర్నన్న కనికరమైనా లేకుండా అటు తిరిగిహాయిగా శయనించింది మా మాతాశ్రీ.

ఇహ లాభం లేదని ఈసారి మా పితాశ్రీకి 'జై' కొట్టడానికి... సన్నాహాలు ప్రారంభించాను!

ఏ కళ నున్నారోగానీ మా నాన్నగారు నా కథ వినడానికి ఒప్పుకొన్నారు!

కానీ... ఒకవైపు నాన్న గారికి నా కథ విన్పించాలని నేను ప్రయత్నిస్తూంటే... మరోవైపు నాన్నకి తెలీకుండా.. నాన్న వెనకాలచేరి... నాకు మాత్రమే విన్పించేలా మా చిన్నక్కయ్య మూతి ముప్పై వంకర్లు తిప్పుతూ... టీజింగ్‌గా.. 'అహనీ కథంటా... ఒహో నీ కథంటా.. నీకు నాకు డోకంటా!టాం!టాం!' పాడిందే తప్ప పోన్లే.. ఏదో చిన్నపిల్ల కథరాసింది...ఎంకరేజ్ చేద్దాం అనే ధ్యాసే లేదు!

పైగా నాకథ విన్పించు కోకుండా తనెప్పుడో రాసేద్చిన మినీ కథల్ని పదేపదే డబ్బా వాయించడం మొదలెట్టింది.

ఇంతలో నన్ను చూడటానికి మా వదిన వచ్చింది!

'ఏకైక శ్రోత దొరికిందికదాని మురిసిపోయి... ఇహ నా కథలు విన్పించడం మొదలెట్టాను!

ఆడపడుచునన్న భయంతోనేమో నేను కథలు చదివినప్పుడల్లా మా వదిన అటెన్షన్ పోజుతో నిటారై చచ్చినట్టు వినేది.

నేను అప్పటికి రాసింది ఒకటే కథైనా 'రెండోకథ ఉందే చదువు' అనో... ఇచ్చిన కథని మధ్యలో ఆపి... 'మరోకథ ఏదైనా ఉందా' అనో... అతి వినయం ప్రదర్శించేది.

అరికాలి మంట నెత్తికెక్కినా అవసరం నాది కదాని 'ముందిది విను వదినా తర్వాత కథ తర్వాత చూద్దాం!... అని ఆమె మూడ్‌ని మళ్ళీ నా కథపైకి మరిల్చేదాన్ని

ఎన్నో రాత్రులు.. ఎన్నెన్నో ఆలోచనలు తెచ్చుకొని... ఎంతో ప్రయాసపడి కథరాస్తే వీళ్ళకి నాకథ మీద ఇంత నిర్లక్ష్యమా.. పైగా కథ చదివి విన్పిస్తూంటే రకరకాల సాకుల్తో తప్పించుకో చూస్తారా... ఇహ లాభంలేదు.. వీళ్ళనిలా వదిలేదిలేదు... వీళ్ళతో ఎలాగైనా నా కథ విన్పించేలా చేయాలని.. ఓరోజు కథంతా ఒక క్యాసెట్‌లో రికార్డ్ చేశాను!

'ఎంచక్కా వాల్యూం పెంచి.. టేప్ రికార్డర్ ఆన్‌చేసి.. వీళ్ళ పని పడ్తే సరి.. వినక ఛస్తారా!' అనుకున్నాను.

ఎక్కడెక్కడో పనిచేసుకుంటోన్న ఇంట్లో వాళ్ళకు.. టేప్ రికార్డర్‌లో నాకథ విన్పిస్తూంటే వాళ్ళ ఫీలింగ్స్ ఎలా ఉంటాయో చూడాలని... వాల్యూమ్‌ని అడ్జెస్ట్ చేయడానికి ఒకడుగు అలా వేశానో లేదో... మేమింట్లో పెంచుకుంటోన్న తెల్లపిల్లి కన్పించింది!

ఇది రోజూ నేను కథ రాయడం... ఇంట్లో వాళ్ళు వెక్కిరించడం గమనించింది కాబోలు... 'పోన్లే దీనికైనా నా కథ మీద ఇంట్రెస్ట్ చచ్చింది!' అని మురిసిపోయి... టేప్ రికార్డర్ని దాని దగ్గరికి జరిపి... టేప్ ఆన్ చేశాను!

అంతే!

దాన్నెక్కడ టేప్ రికార్డర్‌కి కట్టి పడేస్తానేమనుకుందో ఏమో... కిటికీలోంచి చెంగున దూకి కంటికి కనిపించకుండా మాయమైంది! తిక్క పీనుగ!

పిల్లి చేష్టకి నవ్వాలో...నాకథ వినందుకు ఏడ్వాలో తెలీక జుట్టు పీక్కున్నాను!

'ఈ మాత్రం దానికే టేప్ రికార్డర్ పక్కన ఏదో వినేదాన్లా పెద్ద పోజిచ్చి కూర్చుంది' తిట్టుకున్నాను కసిదీరా.

'వెధవ పిల్లి! దీనిక్కూడా నా కథంటే అంత నవ్వులాటగా ఉందన్న మాట! పాలు తాగడానికి రా... నీ పని పడ్తాను' అనుకున్నాను.

'తెల్లగా, ముద్దుగా, బొద్దుగా ఉంది కాబట్టి సరిపోయింది.. లేకపోతేనా అది చేసిన అవమానానికి దాని మూతికున్న మీసాలు పీకేసి, అవక దాని పీక నులిమేద్దును!' కచ్చగా గొణుక్కున్నాను.

ఇంతలో నా జ్వరం తగ్గింది! సెలవు అయిపోయింది! ఆఫీస్‌లో జాయినయ్యాను!

ఎప్పుడు నా ఫ్రెండొస్తారా...ఎప్పుడెప్పుడు నేను రాసిన కథ వాళ్ళందరికీ చూపిద్దామా అన్న తహతహతో ఉన్నానేమో... లంచవర్లో ఒక్కొక్కర్నీ కూర్చోబెట్టి... కాఫీలూ, టిఫిన్లూ సప్లయ్‌చేసి... వాళ్ళకెదురుగా



కూర్చుని... వాళ్ళ ముఖాల్లో ముఖం పెట్టి.. వాళ్ళ ఫేస్ ఫీలింగ్స్ గమనించడం మొదలెట్టాను!

వాళ్ళు నా కన్నా రెండాకులు ఎక్కువే చది వారేమో... వాళ్ళంత కన్నా తెలివిగా నాకథ పట్ల వాళ్ళ స్పందనేంటో తెలీకుండా జాగ్రత్తపడ్డారు!

ఇక... ఆత్రం ఆపుకోలేక నోరుతెరచి 'కథ ఎలా ఉంది' అని అడిగితే... కథ తమాషాగా ఉందని కొందరూ, బావుందని మరి కొందరూ, కథలోని కొన్ని పదాలను పట్టుకుని అవహేళన చేసిన వాళ్ళు ఇంకొందరూ!

ఏదేమైనా.. 'భవిష్యత్తులో అఖిలాంధ్ర పాఠకుల విమర్శలు తట్టుకునే గుండె నిబ్బరం ఇలా అలవర్చుకోక తప్పదు కదా' అని అన్నీ మౌనంగా భరించాను!

ఈ ఎదురు దెబ్బలు... నాకు బాధ కల్గించినా... 'నవ్విన నాపచేనే పండదా అన్నట్లు... నా రచనలు దిన దిన ప్రవర్ధమానంలా వెలిగిపోయి... నేనే నాట్కైనా ప్రముఖ రచయిత్రుల జాబితాలో చేరవలసిందే కదా.. అప్పుడు చూస్కోండి!' అని నన్ను నేను సముదా యించుకుని నా కథని ఓ ప్రముఖ పత్రికకి పంపించాను!

ఓ నెల తర్వాత....

నా కథలు ప్రచురిస్తామనీ, వెంటనే తమని కలవమనీ, ఆ పత్రిక ఎడిటర్ నుండి నాకు పిలుపొచ్చింది!

ఎగిరి గంతేశాను!

తీరా... అక్కడికెళ్ళాక... ఇచ్చిన కథ ఇచ్చినట్లుగా డైరెక్ట్‌గా వేయడం వీలుకాదనీ... అక్కడక్కడా కొన్ని మార్పులూ, చేర్పులూ చేస్తామన్నారు!

మనసులో లబోదిబో అనుకున్నా.... కథ ఇచ్చిన ఖర్మానికి అన్నీ చచ్చినట్లు సహించాను!

ఎడిటర్ ఆ కథని సబ్ ఎడిటర్‌కిచ్చారు!

సబ్ ఎడిటర్ కథంతా చదివి... రంధ్రాన్వేషణ చేసి...'దీనర్థం ఏమిటీ... దానర్థం ఏమిటీ...' అంటూ నేనురాసిన వాక్యాలకి అర్థాలూ, నానార్థాలూ... నేనలా రాసినందు వల్ల వచ్చే అపార్థాలూ, పాఠకులు తీసే పెడర్థాలూ సుదీర్ఘంగా చర్చించి.. వాక్యాలకు వాక్యాలే కొట్టేస్తూ.. కథంతా తిరిగి రాస్తూంటే.. మనస్సంతా గిలగిల్లాడి పోయింది!

'అయ్య బాబోయ్! ఇలా కథంతా సవరించు కుంటూ పోతే... ఆ కథలో ఇహ నేను వ్రాసిందేమిటో' అర్థంగాక చచ్చాను!

ఇంతలో ఎడిటర్ నుండి పిలుపొచ్చింది!

"మీ కథతో పాటు మీ ఫోటో ప్రచురిస్తాం! మీ ఫోటో ఒకటి ఇవ్వండి!" అన్నారు.

సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాను... నా ఫోటో చూసి నన్ను వెక్కిరించిన వాళ్ళ ముఖాలన్నీ మాడిపోతాయి కదా అనీ!

"పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోనా, బ్లాక్ అండ్ వైట్ ఫోటోనా.. కలర్ ఫోటోనా" గుక్క తిప్పుకోకుండా గబగబా అడిగేశాను.

బోడి కథకు ఫోటోలు కూడానా అను కున్నాడేమో... నా వెనకాలే వచ్చిన సబ్ ఎడిటర్ ఎందుకో నవ్వాపుకోవడానికి అష్టకష్టాలు పడటం గమనించాను.

నాకెందుకో ఒక క్షణం గిల్టీగా అన్పించి"ఫోటో ఎందుకు లెండి" అని మొహమాట పడ్డాను!

ఎడిటర్‌కి నా ఇబ్బంది అర్థమైందేమో... "ఫర్వాలేదు! మీరేం వర్రీ కాకండి! ఏ పత్రిక్కైనా సవరించకుండా ఉన్నదున్నట్టు ప్రచురించగలిగే కథలు వేళ్ళమీద వస్తాయి! కథలు బావుండీ...కథలు రాయడంలో మెళకువలు తెలీనపుడు.. కథల్లో మార్పులూ, చేర్పులూ చేయడం, సవరించడం మా సబ్ ఎడిటర్స్‌కి తప్పదు! మీరు కథలు రాస్తూ ఉండండి.. కొన్నాళ్ళకి మీరే తెలుసుకుంటారు!" అంటూ ధైర్యం చెప్పారు.

అప్పటి దాకా ఎంతో అనీజీగా ఫీలయిన నేను... ఒక్కసారి 'హమ్మయ్య' అనుకుని.

"ఓష్...సబ్ ఎడిటర్స్ చేసే పనే ఇదన్న మాట. కథ రాయడం ఇంత సులభమన్న మాట!" అనిసంబర పడిపోయాను!

ఒక క్షణం క్రితం దాకా ఫోటో ఇవ్వడానికి జంకిన నేను...'అహ నా కథంటా... ఓహో నా కథంటా' అని పాడుకుంటూ... కలర్ ఫోటో ఇవ్వడానికి సిద్ధపడ్డాను!

హార్నీ నా పాడు కథ పాడు గానూ... నన్నెంత హైరానాపెట్టింది!★




## లెక్క

కళ్ళ డాక్టర్ : ఇవి ఎన్ని వేళ్ళు?

పేషంట్ : ఆరు.

డాక్టర్ : నీది దృష్టిలోపమో, లెక్కల పరిజ్ఞాన లోపమో నాకర్థం కావటం లేదయ్యా.

-ఊర్మిళా సుభాన్

మహబూబ్‌నగర్.

